క్లుప్తంగా

విద్యతో ఉన్నత శిఖరాలకు

బుచ్చిరెడ్డిపాళెం: విద్యతో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని ఆపస్ జిల్లా అధ్యక్షుడు కె.రాజగోపాలాచారి అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదివి అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను స్థానిక బెజవాడ బుజ్జమ్మ బాలికోన్నత పాఠశాలలో గురువారం ఆపస్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రణాళికబద్ధంగా విద్యనభ్యసిస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు కార్పొరేట్ స్కూళ్ల విద్యార్థులతో సమానంగా ఫలితాలు సాధించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఇందుకు తల్లిదండ్రుల ప్రోత్సాహం తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్ఎంలు సుజాత, పీవీ రత్నం, జిల్లా రిసోర్స్‌పర్సన్ గండికోట సుధీర్, ఉపాధ్యాయులు చంద్రమౌళి, సురేంద్రయ్య, మల్లికార్జున, రవి, నారాయణ, మణికంధరాచారి, హజరత్ పాల్గొన్నారు.

కనులపండువగా వీరభద్రస్వామి కల్యాణం

మనుబోలు: మండలంలోని శ్రీభద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయ శత వార్షికోత్సవాల్లో భాగంగా చివరి రోజైన బుధవారం రాత్రి వీరభద్రస్వామి–భద్రకాళి కల్యాణం, గ్రామోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య స్వామివారికి కలశాభిషేకం, మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, మహాగణపతి పూజ, మూలమంత్ర హోమం, మహా చండీహోమం, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం వీరభద్రస్వామి–భద్రకాళి అమ్మవార్లకు ఆలయ ప్రధానార్చకుడు గంధళ్ల శ్రీనివాసులు శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. కల్యాణానికి పెద్ద సంఖ్యలో మహిళలు హాజరయ్యారు. భక్తులకు భారీసాయిలో అన్నదానం చేశారు. అనంతరం ప్రత్యేక పుష్పాలంకరణ చేసిన వాహనంపై శ్రీవీరభద్రస్వామి–భద్రకాళి అమ్మవార్లను కొలువుదీర్చి వేడుకగా గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవం వెంట ఏర్పాటు చేసిన తెనాలి బ్యాండ్, బేతాళ నృత్యాలు, ప్రత్యేక వేషధారణలు ఆకట్టుకున్నాయి. స్వామివారికి వేసిన వడమాలను వేలం వేయగా నెల్లూరుకు చెందిన భాగవతుల విజయకృష్ణ–విరంజిని దంపతులు రూ.3 లక్షలకు దక్కించుకున్నారు. అలాగే స్వామివారికి ప్రసాదంగా ఉంచిన లడ్డూను వేలం వేయగా రూ.1.75 లక్షలకు గూడూరు పెంచలయ్య–జ్యోతి దంపతులు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమాలకు భాగవతుల విజయ రాఘవేంద్ర–శైలజ, పొట్టి నాగేంద్ర–అనూరాధ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

హైస్కూల్ ప్లస్‌లో మరో డిజిటల్ బోర్డు

కొడవలూరు: మండలంలోని నార్తురాజుపాళెంలో ఉన్న హైస్కూల్ ప్లస్(బాలికల)లో దాత సహకారంతో మరో డిజిటల్ బోర్డు ఏర్పాటు చేస్తున్నట్లు డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు తెలిపారు. నార్తురాజుపాళెం హైస్కూల్ ప్లస్‌లోని వసతులపై ముద్రించిన ప్రచార కరపత్రాలను ఆ పాఠశాల ప్రాంగణంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతేడాది ఇక్కడ బాలికల కోసం ప్రభుత్వం ఫస్టియర్ ఇంటర్ ప్రారంభించగా విద్యార్థులకు మెరుగైన బోధన అందాలన్న లక్ష్యంతో తాను సొంత నిధులతో డిజిటల్ బోర్డు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ ఏడాది నుంచి ఇక్కడి హైస్కూల్ ప్లస్‌లో ఇంటర్ సెకండ్ ఇయర్ కూడా అందుబాటులోకి వచ్చినందున వారికి కూడా డిజిటల్ బోర్డు సదుపాయం కల్పించాలని నిర్ణయించామన్నారు. ఇందుకు దాత, గండవరం సమీపంలోని అల్ఫా మెరైన్ రొయ్యల పరిశ్రమ యజమాని సుధాకర్‌యాదవ్‌ను కోరగా ఆయన సహకరిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం, ఎంఈఓ జి.వసంతకుమారి, హెచ్ఎం డి.ఓబులేసు, అల్ఫా మెరైన్ యజమానులు సుధాకర్ యాదవ్, మస్తాన్‌నాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు కొండా శ్రీనివాసులురెడ్డి, ఎండీ కరిముల్లా, శ్రీనివాసులు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రంలో పరిశీలన

పొదలకూరు: పట్టణంలోని ఆధార్ కేంద్రాన్ని డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ వసుమతి గురువారం పరిశీలించారు. ఆధార్ కేంద్రంలో నమోదవుతున్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. పక్కనే ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో ప్రీ స్కూల్ పిల్లలకు కూడా ఆధార్ నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఆయా కేంద్రాల్లోని పిల్లలకు ఆధార్ నమోదు చేయించాలని సూచించారు.

బాధ్యతలు చేపట్టిన బాలసుబ్రమణియన్

ముత్తుకూరు: ముత్తుకూరులోని మత్స్యకళాశాలలో నూతన అసోసియేట్ డీన్‌గా డాక్టర్ ఎ.బాలసుబ్రమణియన్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ స్థానంలో ఉన్న డాక్టర్ రామలింగయ్య బుధవారం ఉద్యోగ విరమణ చేసిన విషయం తెలిసిందే. ఫిషరీస్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ హెడ్‌గా బాధ్యతలు నిర్వహిస్తూ అసోసియేట్ డీన్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ బాలసుబ్రమణియన్‌కు ఈ సందర్భంగా కళాశాల ప్రొఫెసర్లు అభినందనలు తెలిపారు.

నేత్రపర్వంగా వెంకటేశ్వరుడి కల్యాణోత్సవం


కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు

నెల్లూరు(బృందావనం): బాలాజీనగర్‌లోని సాయి దర్బార్ అద్దాల మందిర 18వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీదేవీ, భూదేవీ సమేత వెంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని నేత్రపర్వంగా గురువారం నిర్వహించారు. సాయిమాత నిత్యాన్న ప్రసాదాలయం ద్వారకామాయిలో కల్యాణ మహోత్సవాన్ని జరిపారు. నారాయణం దాశరథి ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా జరిపారు. గోవిందుడి నామస్మరణతో ప్రాంగణం మార్మోగింది. సుమారు రెండు వేల మందికిపైగా భక్తులకు తీర్థప్రసాదాలు, కల్యాణ తలంబ్రాలు, ముత్యాలు, తదితరాలను అందజేశారు. ఉభయకర్తలుగా కృష్ణగిరి దేశ్‌పాల్ సింగ్, దేవకిదేవి దంపతులు, యోగసాహితి వ్యవహరించారు. మందిర మేనేజింగ్ ట్రస్టీ మధుసాయి, గౌరవ సలహాదారు పాబోలు రామసుబ్బయ్య, తదితరులు పర్యవేక్షించారు.


వీక్షిస్తున్న భక్తులు

పేద కుటుంబాలకు ఆర్థిక చేయూత

నెల్లూరు (అర్బన్): మూడో డివిజన్లోని కిసాన్‌నగర్, పదో డివిజన్లోని రామచంద్రాపురం ప్రాంతాల్లో ఎలాంటి ఆధారం లేని ముగ్గురు వృద్ధ పేద కుటుంబాలకు అమ్మా యూత్ ఫౌండేషన్ చేయూతనందించింది. ఒక్కో కుటుంబానికి రూ.వెయ్యి చొప్పున నగదును గురువారం అందజేశారు. దివంగత రమణమ్మ, దాట్ల వెంకటరెడ్డి కుటుంబసభ్యులు కార్యక్రమానికి సహకారం అందించారని ఫౌండేషన్ అధ్యక్షుడు రమేష్‌బాబు తెలిపారు. నేతలు శశికిరణ్, కార్తికేయ, తదితరులు పాల్గొన్నారు.



అక్రమ నిర్మాణాలను నిలిపేయాలి

నెల్లూరు రూరల్: కొత్తూరులోని హెచ్‌కే బాబు కాలనీలో గల కనుపూరు కాలువ బ్రిడ్జి వద్ద సర్వే నంబర్ 2080లో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి పక్కా నిర్మాణాలను సాగిస్తున్నారు. దీంతో నగరపాలక సంస్థ టౌన్‌ప్లానింగ్ అధికారులు అక్కడికి గురువారం చేరుకొని నిర్మాణాలను నిలిపేయాలని ఆదేశించారు. ఈ క్రమంలో టౌన్‌ప్లానింగ్ అధికారి ప్రవీణ్, కొందరు సిబ్బందితో నిర్మాణాలు చేపడుతున్న వ్యక్తులు గొడవపడ్డారు. దీంతో ఈ ప్రాంతంలో ఉద్రిక్తత నెలకొంది. కాగా సమీపంలో ఉన్న గిరిజన కాలనీ, రజక కాలనీకి ఈ మార్గం మీదుగానే రాకపోకలు సాగించాల్సి ఉంటుందని, ఆక్రమణల కారణంగా ఇబ్బందులు ఏర్పడతాయని స్థానికులు తెలిపారు. ఈ విషయమై రెవెన్యూ, పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేశారని సమాచారం.



జీజీహెచ్‌లో మెరుగైన వైద్య సేవలు

నెల్లూరు (అర్బన్): నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో మెరుగైన వైద్యసేవలను అందించేందుకు అన్ని విభాగాలకు చెందిన హెచ్‌ఓడీలు చర్యలు చేపట్టాలని ఆస్పత్రి, మెడికల్ కళాశాల అభివృద్ధి కమిటీ కో ఆర్డినేటర్ లక్ష్మీసునంద, ఇన్‌చార్జి సూపరింటెండెంట్ రమేష్‌బాబు సూచించారు. దర్గామిట్టలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో వైద్యశాఖ హెచ్‌ఓడీలతో గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో రమేష్‌బాబు మాట్లాడారు. డీఎంఈ ఆదేశాల మేరకు ఆర్థోపెడిక్, జనరల్ సర్జరీ, నేత్ర, ఈఎన్టీ, స్కిన్, పల్మనాలజీ, డెలివరీలు, తదితర అన్ని విభాగాల్లో ఆరోగ్యశ్రీ కేసులను పెంచాలని ఆదేశించారు. ఆరోగ్యశ్రీ కేసులు పెరిగితే రోగులకు ఆరోగ్యంతో పాటు ఆస్పత్రికి ఆదాయం చేకూరుతుందని తెలిపారు. స్పందనలో వస్తున్న అర్జీలను సత్వరమే పరిష్కరించాలని సూచించారు. కాజ్యువాల్టీ విభాగంలో కొరతగా ఉన్న మెడికల్ ఆఫీసర్ల సమస్యను అధిగమించేందుకు గానూ ఇతర విభాగాల నుంచి తీసుకొచ్చేలా చర్యలు చేపడుతున్నామని వివరించారు. ఆర్ఎంఓ సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రమేష్‌బాబు

మలేరియా నివారణకు కృషి

నెల్లూరు (అర్బన్): జిల్లాలో మలేరియా నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఇన్‌చార్జి డీఎంహెచ్ వెంకటప్రసాద్ పేర్కొన్నారు. జాతీయ మలేరియా నివారణ మాసోత్సవాలను పురస్కరించుకొని సంతపేట, గుప్తా పార్క్, డీఎంహెచ్ఓ కార్యాలయ పరిసర ప్రాంతాల్లో అవగాహన ర్యాలీని వైద్య శాఖ ఉద్యోగులు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దోమ కాటుతో మలేరియా, డెంగీ, చికున్ గున్యా, తదితర వ్యాధులొస్తున్నాయని చెప్పారు. ఇంటి పరిసరాల్లో ఖాళీగా ఉండే టెంకాయ చిప్పలు, బాటిళ్లు, నీటి తొట్లు, తదితరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని సూచించారు. దోమల లార్వాలను నశింపజేసేందుకు గానూ ఆయిల్ బాల్స్‌ను వేయాలన్నారు. జిల్లా మలేరియా అధికారి హుస్సేనమ్మ, డాక్టర్లు సుధీర్‌కుమార్, సునీత, ప్రమోద్, డెమో అధికారి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీని ప్రారంభిస్తున్న వెంకటప్రసాద్

లింగ నిర్ధారణకు పాల్పడితే చర్యలు

నెల్లూరు రూరల్: లింగ నిర్ధారణకు పాల్పడే స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలు తప్పవని వైద్య, ఆరోగ్య శాఖ నెల్లూరు డివిజన్ ప్రోగ్రామ్ అధికారి దయాకర్ పేర్కొన్నారు. లింగ నిర్ధారణపై వివిధ శాఖల అధికారులతో సమావేశాన్ని ఆర్డీఓ మలోల అధ్యక్షతన నగరంలోని ఆర్డీఓ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా దయాకర్ మాట్లాడారు. లింగ నిర్ధారణ చట్టాలను సక్రమంగా అమలు చేయాలని సూచించారు. సమాచారం అందిస్తే స్కానింగ్ సెంటర్లపై దాడులు జరిపి చర్యలు చేపడతామని చెప్పారు. అనంతరం మలోల మాట్లాడారు. డివిజన్ పరిధిలోని మండలాల్లో బాల్య వివాహాలను నిరోధించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో వ్యవహరించాలని కోరారు. నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, వైద్యులు బ్రిజిత, మల్లికార్జున్, రూప, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న దయాకర్

మైదానం కాదు చెరువే..!

ఈ చిత్రం చూసి మైదానం అనుకుంటే పొరపాటే. నగరంలోని ఇరుకళల పరమేశ్వరి ఆలయ సమీపంలో గల గణేష్ ఘాట్ వద్ద నెల్లూరు చెరువులో గుర్రపు డెక్క పేరుకుపోయింది. వీటిని తొలగించే దిశగా అధికారులు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు



వేదగిరిలో విశేష పూజలు



నెల్లూరు రూరల్: స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకొని నరసింహకొండపై వెలసిన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో విశేషాభిషేకాలు, ప్రత్యేక పూజలను గురువారం నిర్వహించారు. తిరుప్పావైసేవ, సుదర్శన నారసింహయాగం, కల్యాణం జరిపారు. ఆలయ చైర్మన్ సురేంద్రరెడ్డి, ఈఓ గిరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సింహపురి ఎక్స్‌ప్రెస్ వేళలను మార్చాలి

• ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్ : గూడూరు – సికింద్రాబాద్ – గూడూరు మధ్య నడిచే సింహపురి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ వేళలను మార్చాలని ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి కోరారు. ఢిల్లీలో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌కు వినతిపత్రాన్ని గురువారం అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. గూడూరు నుంచి సికింద్రాబాద్‌కు వెళ్లే రైలు వేళలు సౌకర్యవంతంగా ఉన్నాయని చెప్పారు. సికింద్రాబాద్‌లో రైలు రాత్రి 10.55కు బయల్దేరి మరుసటి రోజు ఉదయం 8.18కు నెల్లూరుకు, 9.20కు గూడూరు చేరుకుంటోందని, అయితే రోజూ ఏదో కారణంతో గంట ఆలస్యంగా నడుస్తోందని తెలిపారు. దీంతో ప్రయాణికుల సమయం వృథా అవుతోందని పేర్కొన్నారు. సికింద్రాబాద్ నుంచి రైలు రాత్రి పది గంటలకు బయల్దేరేలా చర్యలు చేపట్టాలని కోరారు. కాగా తగు చర్యలు చేపడతామని మంత్రి హామీ ఇచ్చారు.

సుధాకర్‌రావుకు పరామర్శ

నెల్లూరు (అర్బన్): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వోద్యోగుల ఫెడరేషన్ జిల్లా చైర్మన్ చేజర్ల సుధాకర్‌రావు సోదరి ఆదిలక్ష్మి గుండెపోటుతో గురువారం మధ్యాహ్నం నెల్లూరులో మృతి చెందారు. దీంతో సంఘ జిల్లా కార్యదర్శి కమల్‌కిరణ్, నేతలు దేవిరెడ్డి రమణారెడ్డి, హరిబాబు, శ్రీనివాసులు, సతీష్‌రెడ్డి, బాలరాజన్ సంతాపం వ్యక్తం చేశారు. హరనాథపురంలోని సుధాకర్‌రావు నివాసానికి వెళ్లి పరామర్శించారు.

రాహుల్ గాంధీకి అండగా ఉందాం

నెల్లూరు (అర్బన్): కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి అండగా ఉందామని డాక్టర్ పల్లం రెడ్డి యశోధర పేర్కొన్నారు. రాహుల్ గాంధీకి మద్దతుగా సంతపేటలో ఇంటింటికీ స్టిక్కర్లను గురువారం పంపిణీ చేసి గోడలకు అతికించారు. పద్మ, జ్యోతి, కోటేశ్వరరావు, కామాక్షి, నయోమీ, తదితరులు పాల్గొన్నారు.

బలిజ విద్యార్థులకు ప్రోత్సాహకాలు

నెల్లూరు (వేదాయపాళెం): పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన బలిజ విద్యార్థులకు పురస్కారాలను అందజేయనున్నామని కాపు హెల్పింగ్ క్లబ్ జిల్లా అధ్యక్షుడు కమతం సుబ్బారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు వివరాలను శనివారంలోపు నమోదు చేసుకోవాలని కోరారు. బహుమతులను ఆదివారం అందజేయనున్నామని, వివరాలకు 94405 10891, 95026 07875 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

గాయపడిన యువకుడి మృతి

నెల్లూరు(క్రైమ్): బస్సు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. సౌత్ ట్రాఫిక్ పోలీసుల సమాచారం మేరకు.. పశ్చిమ బెంగాల్లోని బర్ధమాన్‌కు చెందిన సావిక్ దేవనాథ్ (28) నగరంలోని వివిధ లస్సీ షాపుల్లో మాస్టర్‌గా పనిచేస్తూ అక్కడే నివాసం ఉంటున్నారు. బైక్‌పై వీఆర్సీ మీదుగా ముత్తుకూరు బస్టాండ్ వైపు బుధవారం వెళ్తుండగా, విజయవాడ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. కిందపడిన ఆయనపై బస్సు వెనుక టైరెక్కింది. తీవ్రంగా గాయపడిన ఆయన్ను చికిత్స నిమిత్తం జయభారత్ హాస్పిటల్‌కు, అక్కడి నుంచి జీజీహెచ్‌కు తరలించారు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ మృతి చెందారు. సమాచారం అందుకున్న సౌత్ ట్రాఫిక్ పోలీసులు ఆస్పత్రికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో ధ్వజస్తంభ ప్రతిష్ట పూజలు



నెల్లూరు(బృందావనం): నవాబుపేటలోని భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానంలో నూతన ధ్వజస్తంభ ప్రతిష్ట, మహాకుంభాభిషేక మహోత్సవాలను భక్తిశ్రద్ధలతో గురువారం ప్రారంభించారు. మహాసంకల్పం, గణపతి పూజ, పుణ్యాహవచనం, దీక్షాగ్రహణం, అఖండ దీపారాధన, తదితర పూజా కార్యక్రమాలను కుర్తాళ సిద్ధేశ్వరి పీఠ ఆస్థాన పండితుడు మాచవోలు రమేష్‌శర్మ ఆధ్వర్యంలో వేదపండితులు, అర్చకులు నిర్వహించారు. ధ్వజస్తంభ ప్రతిష్ట దాతలు పోలంరెడ్డి వెంకటేశ్వర్లురెడ్డి, లక్ష్మీప్రత్యూష, పోలుబోయిన ఆదిశేషయ్య, రజని, ఏలేశం భాస్కర్‌రెడ్డి, రమాదేవి, తుమ్మగుంట శేషయ్య, సువర్ణలత, నెల్లిపూడి సుకుమార్‌రెడ్డి, సుధ దంపతులు, ఈఓ నవీన్‌కుమార్, చైర్మన్ వంగాల శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే జరిమానా

నెల్లూరు(బారకాసు): బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే జరిమానాలు విధిస్తామని కమిషనర్ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. పారిశుద్ధ్య పనుల పరిశీలన నిమిత్తం మాగుంట లేఅవుట్లోని వివిధ ప్రాంతాల్లో గురువారం పర్యటించిన ఆయన మాట్లాడారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్తను వేస్తున్న ఫ్లోర్ పాయింట్లను గుర్తించి బాధ్యులకు నోటీసులను జారీ చేయాలని సూచించారు. నెల్లూరు హబ్‌లోని కొంత మంది షాపుల నిర్వాహకులు బహిరంగంగా చెత్తను వేస్తున్నారని, వీరికి నోటీసులను జారీ చేసి జరిమానాలు విధించాలని ఆదేశించారు. దర్గామిట్టలోని ప్రధాన మార్గం వెంబడి ఉన్న వైన్స్, లస్సీ షాపుల నుంచి పెద్ద మొత్తంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ రోడ్లపై చేరుతూ కాలువలను బ్లాక్ చేస్తున్నాయని గుర్తించారు. కాలువల పూడికతీత పనులు చేపట్టి సంబంధిత షాపుల నిర్వాహకులపై కఠిన చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం బోడిగాడితోటలోని డంపింగ్ యార్డును పరిశీలించారు. అసిస్టెంట్ కలెక్టర్ విద్యాధరి, ఎంహెచ్ఓ వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.



కేఏసీలో అడ్మిషన్లు ప్రారంభం

నెల్లూరు రూరల్: నగరంలోని కేఏసీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్ల ప్రక్రియ జోరుగా జరుగుతోంది. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ గురవయ్య మాట్లాడారు. ఒక్క గురువారమే 47 మంది అడ్మిషన్లు పొందారని చెప్పారు. బైపీసీ, ఎంపీసీ, హెచ్ఈసీ, సీఈసీ, వృత్తి విద్య కోర్సులకు విద్యార్థుల నుంచి స్పందన లభిస్తోందన్నారు. అధ్యాపకుడు గోపాల్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



అన్ని వసతులతో చిల్డ్రన్స్ పార్కు ఆధునికీకరణ


స్విమ్మింగ్ పూల్‌ను పరిశీలిస్తున్న వికాస్ మర్మత్

నెల్లూరు(బారకాసు): చిల్డ్రన్స్ పార్కులో అన్ని వసతులను కల్పించి ఆధునికీకరించాలని కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. చిల్డ్రన్స్ పార్కును అసిస్టెంట్ కలెక్టర్ విద్యాధరితో కలిసి కమిషనర్ గురువారం పరిశీలించారు. చిన్న పిల్లలకు ఆటవిడుపు వస్తువులు, వాకింగ్ ట్రాక్, వ్యాయామ ఉపకరణాలు, స్విమ్మింగ్ పూల్, మంచినీటి సౌకర్యం, తదితరాలను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. అవసరమైన అభివృద్ధి ప్రణాళికలను సిద్ధం చేసి త్వరితగతిన అమలు చేయాలని సూచించారు. ఇంజినీరింగ్ విభాగ ఈఈ సంజయ్, తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ శాఖలో బదిలీలు

నెల్లూరు సిటీ: జిల్లా రిజిస్ట్రేషన్ శాఖలో ముగ్గుర్ని బదిలీ చేస్తూ ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వం గురువారం జారీ చేసింది. రాపూరు సబ్ రిజిస్ట్రార్ నందకిషోర్‌ను డీఐజీ కార్యాలయ సూపరింటెండెంట్‌గా బదిలీ చేశారు. పొదలకూరు సబ్ రిజిస్ట్రార్ సుమలతను నాయుడుపేటకు, అక్కడి సబ్ రిజిస్ట్రార్ శోభమ్మను పొదలకూరుకు బదిలీ చేశారు.

వసతిగృహాల్లో ఎక్కువ మంది చేరాలి


మాట్లాడుతున్న హరినారాయణన్


సమావేశానికి హాజరైన అధికారులు

• కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో ఎక్కువ మంది చేరేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ హరినారాయణన్ ఆదేశించారు. సాంఘిక సంక్షేమ శాఖలో అమలవుతున్న పథకాలు, వసతి గృహాల పనితీరు, వసతులు, తాగునీరు, పరీక్ష ఫలితాలు, తదితర అంశాలపై సాంఘిక సంక్షేమాధికారులతో గురువారం సమీక్షించిన కలెక్టర్ మాట్లాడారు. ఈ విద్యా సంవత్సరంలో ఎక్కువ మంది పిల్లలు వసతిగృహాల్లో చేరేలా ఇప్పటి నుంచే చర్యలు చేపట్టాలని కోరారు. జగనన్న విద్యా, వసతిదీవెన పథకాల్లో ప్రభుత్వమిస్తున్న సాయాన్ని కళాశాలలకు సక్రమంగా చెల్లిస్తున్నారాననే అంశాన్ని పరిశీలించాలని చెప్పారు. వసతిగృహాల్లో ఆర్వో ప్లాంట్లు ఎన్ని ఉన్నాయో అడిగి తెలుసుకోవాలన్నారు. నాడు – నేడు కింద వసతిగృహాల అభివృద్ధికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని, మూడు వసతి గృహాల్లో ఆర్వో ప్లాంట్లు పనిచేస్తున్నాయని డిప్యూటీ డైరెక్టర్ వెంకటయ్య తెలియజేశారు. ట్రెయినీ కలెక్టర్ సంజనా సిన్హా, తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ నేతల నిరసన

నెల్లూరు (వేదాయపాళెం): మహిళా రెజ్లర్లను లైంగికంగా వేధింపులకు గురిచేసిన డబ్ల్యూఎఫ్ఐ చైర్మన్ బ్రిజ్‌భూషణ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్ పేర్కొన్నారు. మహిళా రెజ్లర్లకు మద్దతుగా ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో నిరసన కార్యక్రమాన్ని సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం చేపట్టారు. నేతలు రెహనాబేగం, అన్నపూర్ణమ్మ, కొండా ప్రసాద్, పెంచలనర్సయ్య, శ్రీనివాసులు, బలరామ్ పాల్గొన్నారు..

• వీఆర్సీ మైదానంలో నిరసన కార్యక్రమాన్ని ఐద్వా, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ఆవాజ్ ఆధ్వర్యంలో చేపట్టారు. డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న, నగర కార్యదర్శి నరసింహ, ఐద్వా కార్యదర్శి పద్మ, ఆవాజ్ నేత ఫయాజ్ అహ్మద్, ప్రజాసంఘాల నేతలు శేఖర్, జగదీష్, మల్లేశ్వరి, రాజేశ్వరి, విజయలక్ష్మి పాల్గొన్నారు.